క్లుప్తంగా

విధుల్లో చేరిన భద్రగిరి సీడీపీఓ


సుశీలాదేవి

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని భద్రగిరి ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సీడీపీఓగా సీహెచ్ సుశీలాదేవి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఆమె గతంలో ఇదే స్థానంలో విధులు నిర్వహించారు. కొత్త జిల్లాలు ఏర్పాటు అనంతరం సంబంధిత శాఖ అధికారులు ఆమెను అనంతపురం జిల్లాకు బదిలీ చేశారు. అక్కడ నుంచి కొన్ని నెలల క్రితం వెనక్కి వచ్చినప్పటికీ సెలవుపై ఉండడంతో ప్రాజెక్టు ఇన్‌చార్జ్ సీడీపీఓగా దేరువాడ సెక్టార్ సూపర్‌వైజర్ ఈశ్వరమ్మ విధులు నిర్వహించారు.

మిగులు ధాన్యం కొనుగోలు చేయండి


ఎమ్మెల్యే కళావతి

వీరఘట్టం: రైతులు వద్ద ఉన్న ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి కలెక్టర్ నిషాంత్ కుమార్‌ను కోరారు. మంగళవారం కలెక్టర్‌కు ఫోన్ చేసి రైతుల సమస్యలను వివరించారు. రైతుల వద్ద మిగిలిన ధాన్యాన్ని కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని కోరారు. దీనిపై కలెక్టర్ స్పందిస్తూ రెండు రోజుల్లో మిగులు ధాన్యంను కొనుగోలు చేస్తామన్నారని ఎమ్మెల్యే తెలిపారు. రైతులు ఆందోళన చెందొద్దని భరోసా ఇచ్చారు.

ఇంటిపన్ను వసూలు లక్ష్యాలు చేరుకోవాలి

గరుగుబిల్లి: ఇంటి పన్ను వసూలు లక్ష్యాలను వందశాతం చేరుకోవాలని ఎంపీడీఓ జి.పైడితల్లి సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, మహిళా పోలీసులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈఓపీఆర్డీ ఎల్.గోపాలరావు మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలకు సంబంధించి గ్రామాల్లో ఇంటింటి సర్వే చేపట్టాలని, అర్హులకు పథకాలు అందేలా చూడాలన్నారు. వేసవి దృష్ట్యా తాగునీటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

ప్రతీ పంటకు ఈ-క్రాప్ తప్పనిసరి


రికార్డులను పరిశీలిస్తున్న వ్యవసాయశాఖ సహాయ సంచాలకులు లక్షణబాబు

గరుగుబిల్లి: వ్యవసాయశాఖ సిబ్బంది గ్రామాల్లో పర్యటించి రైతులు సాగు చేస్తున్న పంటలను ఈ-క్రాప్‌లో నమోదు చేయాలని రాష్ట్ర వ్యవసాయశాఖ కమిషనరేట్ సహాయ సంచాలకులు బి.లక్ష్మణబాబు అన్నారు. మండలంలోని లఖనాపురం గ్రామంలో మంగళవారం పర్యటించారు. ఈ-క్రాప్‌లో నమోదు చేసిన పెసర, మినుము, నువ్వులు తదితర పంట క్షేత్రాలను పరిశీలించారు. రైతులు వేసిన ప్రతీ పంటను విధిగా ఈ-క్రాప్‌లో నమోదు చేయించుకోవాలన్నారు. దీని వల్ల ప్రకృతి వైపరీత్యాల వల్ల పంటనష్టం జరిగితే బీమా వర్తిస్తుందని, అలాగే సున్నావడ్డీ పథకం వర్తిస్తుందని, గిట్టుబాటు ధర లభిస్తుందని అన్నారు. ఏడీఏ వెంకటేష్, ఏఓ ఆర్.విజయభారతి, డీపీఎం షణ్ముఖరాజు ఉన్నారు.

హెల్మెట్ తప్పనిసరి

గరుగుబిల్లి: ద్విచక్ర వాహన చోదకులు విధిగా హెల్మెట్ ధరించాలని ఎస్సై ఎం.రాజేష్ అన్నారు. మండల పరిధిలోని ఐటీడీఏ పార్క్ సమీపంలో మంగళవారం వాహన తనిఖీలు చేపట్టారు. వాహన చోదకులకు హెల్మెట్ ధరించడం వల్ల కలిగే ఉపయోగాలు, రోడ్డు భద్రత నిబంధనలను వివరించారు. హెల్మెట్ ఒక వ్యక్తి జీవితంతోపాటు కుటుంబ సంక్షేమానికి దోహదం చేస్తుందన్నారు.

ఘనంగా గావు పండగ

కొమరాడ: మండలంలోని పరుశురాంపురంలో మంగళవారం గావు పండగను ఘనంగా నిర్వహించారు. యాదవుల కులదైవం గంగమ్మతల్లికి సంప్రదాయం ప్రకారం పూజలు చేశారు. ఈ సందర్భంగా ఉత్తరాంధ్ర ప్రసిద్ధి చెందిన ధర్మపాట గాయకుడు పిల్లమూడి సత్యం తన పాటతో గంగమ్మతల్లి చరిత్రను వినిపించారు.

హై సెక్యూరిటీ నంబర్ ప్లేట్ తప్పనిసరి

జిల్లా రవాణాశాఖాధికారి సి.మల్లికార్జున రెడ్డి

పార్వతీపురం టౌన్: వాహనాలకు హై సెక్యూరిటీ నంబర్ ప్లేట్ తప్పనిసరి అని జిల్లా రవాణాశాఖాధికారి సి.మల్లికార్జున రెడ్డి స్పష్టం చేశారు. ఈ మేరకు మంగళవారం ఆయన డీటీఓ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ 2014వ సంవత్సరం నుంచి నంబర్ ప్లేట్స్ కోసం ప్రభుత్వానికి ఫీజు చెల్లిస్తున్నప్పటికీ హై సెక్యూరిటీ నంబర్ ప్లేట్స్ వాహనానికి అమర్చుకోకుండా సుమారు 4200 వాహనాలు పార్వతీపురం మన్యం జిల్లాలో తిరుగుతున్నాయన్నారు. వాటికి సంబంధించిన నంబర్ ప్లేట్స్ రాయగడ రోడ్, సూర్యపీఠం ఎదురుగా గల హై సెక్యూరిటీ నంబర్ ప్లేట్స్ ఆఫీస్‌లో అందుబాటులో ఉన్నాయని తెలిపారు. 2014 వ సంవత్సం నుంచి రిజిస్ట్రేషన్ జరిగి హై సెక్యూరిటీ నంబర్ ప్లేట్స్ లేకుండా జిల్లాలో తిరుగుతున్న వాహనాలు తనిఖీల్లో పట్టుబడితే రూ.1000 వరకు అపరాధ రుసుం విధిస్తామని హెచ్చరించారు.


వీరఘట్టం: అవగాహన ర్యాలీ చేపడుతున్న పీహెచ్‌సీ వైద్య సిబ్బంది


పాలకొండ రూరల్: సింగన్నవలసలో చైతన్య ర్యాలీలో చేస్తున్న ఎంపీపీ, వైద్యాధికారి కమల్‌నాథ్


పాలకొండ: కొండాపురంలో సైకిల్ ర్యాలీ చేస్తున్న విద్యార్థినులు

క్యాన్సర్‌పై చైతన్యం

కురుపాం: క్యాన్సర్‌పై ప్రతీ ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని మాదలింగి పీహెచ్‌సీ డాక్టర్ ఎస్.సుప్రియ అన్నారు. మండలంలోని మాదలింగి, రావాడ-రామభద్రపురం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో మంగళవారం క్యాన్సర్‌పై చైతన్య ర్యాలీ చేపట్టారు. క్యాన్సర్ వ్యాధికి కారణాలు, వ్యాధిబారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి పి.శ్రావణ్‌కుమార్, జెడ్పీహెచ్‌ఎస్ హెచ్‌ఎం టి.శంకరరావు, విద్యార్థులు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

• వీరఘట్టం: మండల కేంద్రంలో స్థానిక పీహెచ్‌సీ సిబ్బంది క్యాన్సర్ అవగాహన ర్యాలీ చేపట్టారు. క్యాన్సర్ రకాలు, లక్షణాలు, చికిత్సపై డాక్టర్ పి.ఉమామహేశ్వరి అవగాహన కల్పించారు. వ్యాధిని సకాలంలో గుర్తిస్తే చికిత్స ద్వారా నయం చేయవచ్చన్నారు. మద్యపానం, ధూమపానం, ఖైనీ, గుట్కా వంటి వాటికి దూరంగా ఉంటూ ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ర్యాలీలో ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

• పాలకొండ రూరల్: ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్య రక్షణకు తొలి ప్రాధాన్యత ఇవ్వాలని ఎంపీపీ బొమ్మాళి భాను అన్నారు. మండలంలోని సింగన్నవలసలో అన్నవరం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన క్యాన్సర్ అవగాహన ర్యాలీలో


కురుపాం: ర్యాలీలో పాల్గొన్న వైద్య సిబ్బంది, విద్యార్థులు

ఆయన పాల్గొన్నారు. క్యాన్సర్‌కు కారణాలు, వ్యాధి బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వైద్యాధికారి వేములకొండ కమల్‌నాథ్ వివరించారు. ప్రతి రోజు వ్యాయామం చేయడం, మంచి ఆహార అలవాట్లు పాటించడం ద్వారా రోగనిరోధక శక్తిని పెంపొందిచుకోవచ్చన్నారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈఓ జనార్దనరావు, హెల్త్ సూపర్‌వైజర్ కె.రాణి, హెల్త్ సహాయకులు పి.రాంబాబు తదితరులున్నారు.

• పాలకొండ: మండలంలోని కొండాపురం గ్రామంలో స్థానిక ప్రభుత్వ బాలికల కళాశాల విద్యార్థినులు క్యాన్సర్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. గ్రామీణ హెల్త్ సెంటర్ ఎంఎల్‌హెచ్‌పీ ఎస్.దేవి ఆధ్వర్యంలో సైకిళ్లపై గ్రామంలో తిరుగుతూ ప్రచారం చేశారు. సైక్లింగ్ ద్వారా కలిగే ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎం కుమారి, సచివాలయ సిబ్బందితో పాటు గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే కృషి

భామిని: మండల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే కళావతి కృషి చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు, మండల పరిషత్ ప్రత్యేక అహ్వానితుడు తోట సింహాచలం అన్నారు. ఎంపీపీ తోట శాంతికుమారి అధ్యక్షతన మంగళవారం నిర్వహించిన మండలం సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఏనుగుల సమస్యలను ఎమ్మెల్యే కళావతి అసెంబ్లీలో లేవనెత్తారని, సమస్య శాశ్వత పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. సీఎం జగనన్న మానస పుత్రికలు గ్రామ సచివాలయ భవనాల నిర్మాణాలపై జాప్యం వద్దని, ఇప్పటి వరకు జరిగిన పనులకు బిల్లుల చెల్లింపునకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. గృహ నిర్మాణాలకు అవసరమైన ఇసుక రవాణాకు అనుమతులు ఇవ్వాలని భామిని సొసైటీ చైర్మన్ గెల్లంకి రమేష్ అధికారులను కోరారు. పాడి రైతులకు పశువుల దాణా సరఫరా చేయాలని బత్తిలి సొసైటీ చైర్మన్ బి.రఘుపతినాయుడు కోరగా సమీ


సమావేశంలో మాట్లాడుతున్న తోట సింహాచలం, ఎంపీపీ శాంతికుమారి

కృత దాణాను ఆర్‌బీకేల ద్వారా కేటాయిస్తున్న పశువైద్యాధికారి హరిప్రసాద్ తెలిపారు. సమావేశంలో వైస్ ఎంపీపీ బి.ధర్మారావు, మర్కెట్ కమిటీ చైర్మన్ హెచ్.మోహనరావు, ప్రత్యేక ఆహ్వానితులు కె.చిరంజీవులు, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు ఎం.మోహన్‌బాబు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థుల సామర్థ్యాలు మెరుగుపర్చాలి

గుమ్మలక్ష్మీపురం: విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలు మెరుగుపర్చాలని లిప్ (లెర్నింగ్ ఇంప్రూవ్‌మెంట్ ప్రోగ్రాం) రాష్ట్ర బృందం సభ్యులు డాక్టర్ తిరుమల చైతన్య, పాలకొండ ఉప విద్యాశాఖాధికారి ఆర్.విజయకుమారి, శ్రీకాకుళం జిల్లా డైట్ ఉపన్యాసకులు భారతమ్మ, సతీష్ సూచించారు. గుమ్మలక్ష్మీపురం కేజీబీవీని మంగళవారం వారు సందర్శించారు. లిప్ కార్యక్రమం అమలు తీరును పరిశీలించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులతో మాట్లాడి పలు సూచనలు చేశారు. 6,7,8 తరగతుల విద్యార్థుల్లో ఫౌండేషన్ లిటరసీని పెంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం 10 జిల్లాల్లో 100 రోజుల పాటు ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తోందన్నారు. ఉపాధ్యాయులు బోధన వ్యూహాలు మార్చుకొని విద్యార్థులకు ఫౌండేషన్ లిటరసీని పెంపొందించాలని సూచించారు. వారి వెంట ప్రిన్సిపాల్ సీహెచ్ శ్రీరంజని, జెడ్పీహెచ్‌ఎస్ ఉపాధ్యాయుడు ఎం.సీతన్న ఉన్నారు.


ఉపాధ్యాయులకు సూచనలు చేస్తున్న లిప్ రాష్ట్ర బృందం సభ్యులు

- భామిని: బత్తిలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, నులకజోడు ఎంపీయూపీ పాఠశాలను లిప్ ప్రోగ్రాం రాష్ట్ర బృందం మంగళవారం సందర్శించింది. విద్యార్థుల సామర్థ్యాలు, ఉపాధ్యాయుల లెసన్‌ప్లాన్లు, డైరీలు, బోధన పద్ధతులను పరిశీలించారు. హెచ్‌ఎం ఆర్.వెంకటరమణ, సబ్జెక్టు ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు.

ఇసుక ర్యాంప్ నిర్వహణకు అనుమతి

భామిని: మండలంలోని దిమ్మిడిజోల-సొలికిరి గ్రామాల మధ్య వంశధార నదీ తీరంలో ఇసుక ర్యాంప్ నిర్వహణకు ఒడిశా నుంచి ఎటువంటి అభ్యంతరాలు లేవని సబ్‌కలెక్టర్ నూరుల్‌కమర్ స్పష్టం చేశారు. ఆంధ్రా తీరంలో ఒడిశా పర్మిట్‌తో అక్రమంగా ఇసుక తరలిస్తున్నారనే ఫిర్యాదుపై మంగళవారం ఆయన విచారణ చేశారు. ఈ సందర్భంగా ఇసుక ర్యాంప్ నిర్వహణ అనుమతులపై ఒడిశాలోని పర్లాకిమిడి సబ్‌కలెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడారు. ర్యాంప్‌లో సుమారు 50 ఎకరాల భూభాగాన్ని ఒడిశాకు చెందినదిగా జీపీఎస్‌లో ధృవీకరించారు. ఆంధ్రా పర్మిట్‌తో ఇసుక రవాణా చేయడానికి అభ్యంతరాలు లేవని ఫిర్యాదుదారులకు స్పష్టం చేశారు. వ్యవసాయ భూములలో రైతుల ఇష్టం మేరకు రోడ్డు వేయడంపై అడ్డు చెప్పాల్సిన పని లేదన్నారు. ఆయన వెంట తహసీ


వంశధార తీరంలోని ఇసుక ర్యాంప్‌ను పరిశీలిస్తున్న సబ్‌కలెక్టర్ నూరుల్‌కమర్

ల్దార్ నీలాపు అప్పారావు, సర్వేయర్ తోట రామ్మోహనరావు, ఎంపీటీసీ కొత్తకోట చంద్రశేఖర్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ కె.ఆంజనేయులు, సహకార సంఘం డైరెక్టర్ కాగితాపల్లి కృష్ణారావు, ఆర్ఐ రాంబాబు, వీఆర్‌ఓ జి.వెంకటరమణ ఉన్నారు.

వీర జవాన్లకు నివాళి


పుల్వామా ఘటన జరిగి మంగళవారం నాటికి నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా వీరఘట్టం మండలం రేగులపాటు కేజీబీవీ ఉపాధ్యాయులు, విద్యార్థులు అమర వీరులకు నివాళులర్పించారు. దాడిలో మరణించిన వీర జవాన్ల ఆత్మకు శాంతి చేకూరాలని, దేశ రక్షణ కోసం సరిహద్దుల్లో పహారా కాస్తున్న సైనిక సోదరులు క్షేమంగా ఉండాలని ప్రార్థించారు. జాతీయ జెండాకు సెల్యూట్ చేస్తూ జయహో సైనికుడా అంటూ నినాదాలు చేశారు. -వీరఘట్టం

17న వాహనాల వేలం

జియ్యమ్మవలస: సారా కేసుల్లో పట్టుబడిన వాహనాలను ఈ నెల 17న వేలం వేయనున్నట్లు ఎస్సై కళాధర్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన మాట్లాడుతూ.. చినమేరంగి పోలీస్ స్టేషన్ ఆవరణంలో ఉదయం 10 గంటలకు వేలం ప్రారంభమవుతుందన్నారు. వేలంలో 8 ద్విచక్ర వాహనాలు, ఒక ఆటో ఉన్నాయన్నారు. ఆసక్తి ఉన్నవారు ఆధార్‌కార్డు జిరాక్స్‌తో పాటు వెయ్యి రూపాయలు డిపాజిట్ చేసి వేలంలో పాల్గొనవచ్చన్నారు. వాహనాలు దక్కించుకున్న వారు మొత్తం నగదుతో పాటు 18 శాతం జీఎస్‌టీ చెల్లించాల్సి ఉంటుందన్నారు.

కోటదుర్గమ్మకు సంబర నీరాజనం


అమ్మవారి దర్శనానికి వెళ్తున్న భక్తులు

పాలకొండ రూరల్: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం పాలకొండ కోటదుర్గమ్మ దర్శనానికి మంగళవారం భక్తులు పోటెత్తారు. అమ్మవారికి మొక్కులు చెల్లించి సంబరాలు నిర్వహించారు. మహిళలు ముర్రాటలు సమర్పించారు. నూతన వధూవరులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. సంబరాల సందర్భంగా పులివేషాలు, కాళీమాత వేషధారణలో కళాకారుల ప్రదర్శన ఆకట్టుకుంది.

ఫైలేరియా నివారణపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న ఉదయకుమారి

గరుగుబిల్లి: ఫైలేరియా నివారణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని గరుగుబిల్లి పీహెచ్‌సీ హెల్త్ విజిటర్ ఉదయకుమారి అన్నారు. పీహెచ్‌సీలో ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, సచివాలయ వలంటీర్లకు ఫైలేరియా నివారణ మాత్రల పంపిణీ కార్యక్రమంపై మంగళవారం అవగాహన కల్పించారు. గ్రామాల్లో రెండేళ్ల వయసు పైబడిన వారందరికీ డీఈసీ, ఆల్‌బెండోజోల్ మాత్రలను పంపిణీ చేయాలన్నారు. గర్భిణులు, తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న వారికి ఈ మాత్రలు ఇవ్వొద్దని సూచించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎస్.సులేఖ, సీహెచ్‌ఓ డి.చిన్నమ్మి పాల్గొన్నారు.

నేత్ర వ్యాధులపై నిర్లక్ష్యం వద్దు

పాలకొండ రూరల్: కంటి సమస్యల పట్ల నిర్లక్ష్యం వహించొద్దని నేత్ర వైద్యాధికారి టి.టి.కృష్ణారావు అన్నారు. నగరపంచాయతీ పరిధి కొత్తవీధిలో మంగళవారం వైఎస్సార్ కంటి వెలుగు శిబిరం నిర్వహించారు. 30 మందికి కంటి పరీక్షలు చేశారు. పలువురిని శస్త్రచికిత్సలకు ఎంపిక చేశారు. కళ్ల సంరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. శిబిరంలో ఆశా కార్యకర్త జి.లక్ష్మి సేవలందించారు.

ఎంపీడీఓ పరిశీలన

పాలకొండ రూరల్: మండలంలోని భాసూరు, మల్లివీడు గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి పనులను ఎంపీడీఓ డొంక త్రినాథులు మంగళవారం పరిశీలించారు. పనికి హాజరైన వేతనదారుల సంఖ్య, మస్తర్లను పరిశీలించారు. అనంతరం ఎం.సింగుపురం పీహెచ్‌సీని సందర్శించారు. వైద్యాధికారి కడియం చిరంజీవి నేతృత్వంలో క్షేత్రస్థాయి వైద్య సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆయుష్మాన్ భారత్ కార్యక్రమంలో భాగంగా అమలవుతున్న వైద్య సేవలపై సమీక్షించారు.

డీఈఓ తనిఖీ

జియ్యమ్మవలస: మండలంలోని చినమేరంగి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను పార్వతీపురం మన్యం జిల్లా విద్యాశాఖాధికారి ఎస్‌డీవీ రమణ మంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు. విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించి వంట ఏజెన్సీ నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. తరగతి గదిలో ఉపాధ్యాయుల బోధన, లెసన్‌ప్లాన్, విద్యార్థుల నోట్‌బుక్స్‌ను పరిశీలించారు. సిలబస్ ఎంతవరకు అయ్యిందని ఆరా తీశారు. విద్యార్థులను క్రమశిక్షణ కలిగిన పౌరులుగా తీర్చిదిద్దాలని


మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న డీఈఓ ఎస్‌డీవీ రమణ

ఉపాధ్యాయులకు సూచించారు. ఆయన వెంట డీసీ చొక్కావు శ్రీనివాసరావు ఉన్నారు.

బాలలను చదువుకోనిద్దాం..

గుమ్మలక్ష్మీపురం: బాల కార్మికులను చైల్డ్ హోంకు పంపించి చదువుకోనిద్దామని ఎల్విన్‌పేట ఎస్సై ఎస్.షణ్ముఖరావు అన్నారు. ఆపరేషన్ స్వేచ్ఛ కార్యక్రమంలో భాగంగా మంగళవారం గ్రామ సచివాలయం ఎంఎస్‌పీలు, ఐసీడీఎస్, వైద్య సిబ్బందితో కలిసి గుమ్మలక్ష్మీపురం, ఎల్విన్‌పేట గ్రామాల్లో ఉన్న పలు దుకాణాల్లో తనిఖీలు చేపట్టారు. 14 ఏళ్లలోపు బాలలను పనిలో చేర్చుకోవద్దని, ఎవరైనా అటువంటి చర్యలకు పాల్పడితే కఠిన శిక్షలు తప్పవని హెచ్చరించారు. పిల్లలను ఎవరైనా


గుమ్మలక్ష్మీపురంలో దుకాణ యజమానికి అవగాహన కల్పిస్తున్న ఎస్సై, ఐసీడీఎస్ సిబ్బంది

పనిలో చేర్చుకుంటే సమాచారం ఇవ్వాలని స్థానికులను కోరారు.

స్థానిక సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్సీ చొరవ


రహదారి సమస్యపై ఆస్పత్రి సూపరింటెండెంట్‌తో చర్చిస్తున్న ఎమ్మెల్సీ విక్రాంత్

పాలకొండ: నగర పంచాయతీ పరిధి 4వ వార్డు ఆంజనేయనగర్, టీచర్ కాలనీలో దీర్ఘకాలికంగా ఉన్న సమస్యలు పరిష్కరించేందుకు ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ చొరవ తీసుకున్నారు. మంగళవారం ఆయా ప్రాంతాల్లో పర్యటించిన ఆయన స్థానికులతో మాట్లాడి అక్కడి సమస్యలు తెలుసుకున్నారు. ఆర్టీసీ కాంప్లెక్స్ పక్క నుంచి రహదారి లేక ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు వివరించడంతో.. డిపో మేనేజర్ వెంకటేశ్వరావుతో కలిసి ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. కాలనీవాసులు ఆర్టీసీ కాంప్లెక్స్‌కు వెళ్లేందుకు వీలుగా రహదారి కేటాయించాలని కోరారు. అలాగే డిగ్రీ కళాశాల వైపు నుంచి ఏరియా ఆస్పత్రికి వెళ్లే రహదారి మూసివేయడంతో.. ఆస్పత్రికి వెళ్లి సూపరింటెండెంట్ నాగభూషణరావుతో సమస్య పరిష్కారంపై చర్చించారు. ఆ ప్రాంతంలో ఆక్సిజన్ ప్లాంట్ ఉండడంతో అటువైపు ఉన్న రహదారిని మూసివేశామని నాగభూషణరావు వివరించారు. ప్రత్యామ్నాయ రహదారి కోసం చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్సీ విక్రాంత్ అన్నారు. ఆయనతో పాటు నగరపంచాయతీ చైర్మన్ యందవ రాధాకుమారి, కమిషనర్ సర్వేశ్వరరావు, కౌన్సిలర్లు కొరికాన గంగునాయుడు, దుప్పాడ పాపినాయుడు, తూముల లక్ష్మణరావు, పల్లా భాను, పాలవలస ధవళేశ్వరరావు ఉన్నారు.

ఒత్తిడిని జయిస్తేనే విజయం సొంతం

సీతంపేట: ఒత్తిడిని జయిస్తేనే విజయం సొంతమవుతుందని మనోవిజ్ఞాన శాస్త్ర ఉపన్యాసకులు, వృత్తి వికాస నిపుణుడు అల్లు అప్పన్న అన్నారు. హడ్డుబంగి గిరిజన సంక్షేమ బాలికోన్నత ఆశ్రమ పాఠశాలలో మంగళవారం 'పరీక్ష పర్వ్ 4.0' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పదోతరగతి విద్యార్థులు పరీక్షల ఒత్తిడిని అధిగమించేందుకు, మంచి మార్కులు సాధించేందుకు అవసరమైన సూచనలు, సలహాలను అందజేశారు. సరైన ప్రణాళికతో పరీక్షలకు ప్రిపేర్ అవ్వాలని, ఒత్తడికి గురవ్వొద్దని, మానసిక ఆరోగ్యాన్ని మెరుగుపర్చుకోవాలని సూచించారు. ఆత్మస్థైర్యంతో ముందడుగు వేస్తే అనుకున్న లక్ష్యాలను సాధించవచ్చన్నారు. నేర్చు


మాట్లాడుతున్న వ్యక్తిత్వ వికాస నిపుణులు అల్లు అప్పన్న

కున్న పాఠ్యాంశాలను మర్చిపోకుండా ఎలా గుర్తుపెట్టుకోవాలో వివరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఉమావాణి, డిప్యూటీ వార్డెన్ నీలవేణి, ఉపన్యాసకులు హేమసుందర్, గిరిబాబు పాల్గొన్నారు.

మూలిగూడ పాఠశాలలో సంజీవయ్య జయంతి

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని మూలిగూడ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య 102వ జయంతి కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. పాఠశాల హెచ్‌ఎం, ఎస్సీ,ఎస్టీ ఉపాధ్యాయ సంఘం అధ్యక్షుడు సామల సింహాచలం విద్యార్థులతో కలిసి సంజీవయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ న్యాయశాస్త్రం అభ్యసించిన ఆయన దేశంలో తొలి దళిత ముఖ్యమంత్రిగా, ఉమ్మడి రాష్ట్రానికి రెండవ ముఖ్యమంత్రిగా అనేక సేవలందించారన్నారు. అలాగే ప్రముఖ స్వాతంత్ర్య


సంజీవయ్య, సరోజిని నాయుడు చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న విద్యార్థులు

సమరయోధురాలు, రచయిత్రి సరోజిని నాయుడు 144వ జయంతిని పురస్కరించుకుని ఆమె చిత్రపటానికి నివాళులర్పించారు.

విద్యార్థుల చదువులపై ప్రత్యేక శ్రద్ధ

సీతంపేట: చదువులో వెనుకబడిన విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఎంపీడీఓ కోసూరు గీతాంజలి అన్నారు. మండలంలోని కుశిమి జీటీఎస్, మల్లి గిరిజన గురుకుల పాఠశాలలను మంగళవారం ఆమె సందర్శించారు. 9వ తరగతి విద్యార్థులకు వివిధ సబ్జెక్టులకు సంబంధించిన ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు.మధ్యాహ్న భోజనాలను పరిశీలించి, విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. అనంతరం కుశిమి పీహెచ్‌సీలో జరిగిన సమావేశంలో పాల్గొన్నారు.


లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎంపీడీవో

విద్యార్థిని మృతిపై ఎంపీడీఓ ఆరా

కొమరాడ: మండలంలోని ఉలిపిరి బాలకోన్నత పాఠశాలను ఎంపీడీఓ ఎల్.వి.అప్పారావు మంగళవారం సందర్శించారు. వసతి గృహం విద్యార్థిని కోలక సుమిత్ర మృతికి గల కారణాలను హెచ్‌ఎం లక్ష్మీకాంతంను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వసతి గృహం పరిసరాలు, వంటగది, డార్మిటరీ, భోజనాలను పరిశీలించారు. మృతి చెందిన విద్యార్థిని ఆరోగ్య పరిస్థితిపై ఆమె స్నేహితుల వద్ద ఆరా తీశారు. విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించాలని అక్కడి సిబ్బందికి సూచించారు.

సమగ్ర విచారణ చేపట్టాలి

కొమరాడ: గిరిజన విద్యార్థి కోలక సుమిత్ర మృతిపై సమగ్ర విచారణ చేయాలని గిరిజన విద్యార్థి సంఘం అధ్యక్షుడు పల్లి సరేష్ మంగళవారం డిమాండ్ చేశారు. వసతి గృహంలో ఉన్నాతాధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో విద్యార్థులు ఆరోగ్యంపై శ్రద్ధ పట్టేవారు కరువైయ్యారన్నారు. విద్యార్థుల మరణాలు ఆందోళనకు గురిచేస్తున్నాయని, అందుకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

బాధ్యులను కఠినంగా శిక్షించాలి

సీతంపేట: పూతికవలస గిరిజన సంక్షేమ ఆశ్రమపాఠశాల యాజమాన్యం నిర్లక్ష్యమే విద్యార్థిని కె.పవిత్ర ప్రాణాలు బలిగొందని అఖిల భారత యువజన సమాఖ్య జిల్లా అధ్యక్షుడు కూరంగి గోపి, మండల సీపీఐ కార్యదర్శి కె.జగదీష్ బుధవారం ఒక ప్రకటనలో ఆరోపించారు. ఆమె కుటుంబానికి తక్షణం రూ.10 లక్షల పరిహారం చెల్లించడంతో పాటు బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల ఆరోగ్యంపై సరైన పర్యవేక్షణ, హాస్టల్‌లో సరైన నిర్వాహణ లేక ఇటువంటి సంఘటనలు చోటుచేసుకుంటున్నాయని పేర్కొన్నారు.


ఉలిపిరి వసతి గృహాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ అప్పారావు